# ఈతరం



చినుకు చినుకు కలిస్తేనే సముద్రం.. చేయిచేయి కలిస్తేనే మెరుగైన సమాజం..
ఇది వారు నమ్మిన సిద్ధాంతం.. నమ్మడమే కాదు దాన్ని ఆచరణలో పెట్టారు..
అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు! అందరూ నవ యువతీ యువకులే..
విద్యార్థి దశలోనే విలక్షణ బాటలో సాగుతున్నవారే!
స్ఫూర్తిదాయకమైన విజయాలు సాధిస్తున్న..
వీరితో 'ఈతరం' ముచ్చటించింది.. ఆ వివరాలు మీ కోసం!

# పల్లెల పనిలో... చదువుల గనులు!

ఇంజినీరింగ్ చదువుతున్న మామూలు యువతీయువకులు ఖాళీ సమయాల్లో ఏం చేస్తారు? సినిమాలు, షికార్లు, పబ్‌లు, పార్టీలతో కాలక్షేపం చేస్తారు. కానీ తీరిక చేసుకుని మరీ మారుమూల గ్రామాల్లోకి వెళ్ళి అక్కడి సామాన్యుల సమస్యలు తెలుసుకుంటూ, పరిష్కారానికి కృషి చేస్తూ ఉంటారా? ఉండరు. కాబట్టే ఆ ఆరుగురూ మామూలు యువతీయువకులు కారు.

## మరి ఎవరు వారు?

ముగ్గురు అమ్మాయిలు.. ముగ్గురు అబ్బాయిలు. చదువులో ప్రతిభావంతులు. విలక్షణ దృక్పథం ఉన్న విద్యార్థులు. నాయకత్వ లక్షణాలపై అంతర్జాతీయంగా జరిగిన పోటీలో రాణించిన వారు. అమెరికాలోని ఓ ప్రతిష్ఠాత్మకమైన సంస్థ నుంచి బహుమతులు అందుకున్నవారు. పకడ్బందీ ప్రాజెక్ట్ రూపొందించి భారీ మొత్తాన్ని మంజూరు చేయించుకున్నవారు. ఆ సొమ్ముతో 'పరివర్తన్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి 9 లంక గ్రామాల్లో ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నవారు.

గుంటూరు జిల్లాలోని ఆ 9 లంక గ్రామాల్లోకి వెళ్ళి అక్కడి సామాన్యులను అడిగితే చాలు, ఎక్కడో బిట్స్ పిలానీలో చదువుతూ ఇక్కడి సమస్యల పరిష్కారానికి పాటు పడుతున్న వీరి గురించి చక్కగా వివరిస్తారు. వీళ్ళు ఆరుగురూ దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారైనా కలిసికట్టుగా, ఒకే జట్టుగా ముందుకు సాగుతున్న వైనం ఆసక్తికరం.

## ఎలా మొదలైంది?

ఈ లంక గ్రామాల ఎంపిక వెనుక ఇద్దరు అన్నాచెల్లెళ్ళ పాత్ర ఉంది. వాళ్ళే మండవ హర్షవర్ధన్, దీపికలు. ఇద్దరూ ఇంజినీరింగ్ విద్యార్థులే. తండ్రి జార్ఖండ్ రాష్ట్రం పోలీసుశాఖలో ఐజీ. సొంత ఊరు గుంటూరు జిల్లాలోని ఆముదాలలంక. తల్లిది విజయవాడ. అన్నాచెల్లెళ్ళిద్దరూ సెలవులకి సరదాగా నానమ్మ ఇంటికి వచ్చేవారు. వచ్చినప్పుడల్లా కాలక్షేపం చేసి వెళ్ళిపోకుండా అక్కడి సమస్యలపై అవగాహన పెంచుకున్నారు. వాటి పరిష్కారానికి ఏదో ఒకటి చేయాలనుకునేవారు. మరి ఆ అవకాశం ఎలా వచ్చింది?

## ఆశయానికి ఆసరా

అమెరికాకు చెందిన గోల్డ్‌మ్యాన్ శాక్స్ బ్యాంక్ ఓ ఫౌండేషన్‌ను నడుపుతోంది. ఏటా 'గ్లోబల్ లీడర్స్ ప్రోగ్రాం' ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన కొన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు లీడర్‌షిప్ పోటీలు నిర్వహిస్తోంది. మనదేశంలో 11 చోట్ల జరిగిన ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 29 మందిని ఎంపిక చేశారు. 2008లో ఈ అవార్డులను అందుకున్నవారిలో మండవ హర్షవర్ధన్, ఢిల్లీకి చెందిన తన్విజైన్ ఉన్నారు. ఇలా ఎంపికైన వారెవరైనా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించదలుచుకుంటే నిధులు మంజూరు చేస్తామని ఆ ఫౌండేషన్ ప్రకటించింది. అయితే అందుకు పకడ్బందీగా ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపొందించాల్సి ఉంటుంది. ఆ ప్రకటన చూడగానే హర్షవర్ధన్‌కి లంకగ్రామాల్లో సమస్యలు గుర్తొచ్చాయి. వాటిపై ఉన్న అవగాహనతో తన్వి జైన్, చెల్లెలు దీపిక, సహ విద్యార్థులు పి.ఎస్.సుమంత్ (వెల్లూరు, తమిళనాడు), సౌరవ్ పటియాల్ (హిమాచల్ ప్రదేశ్), సోనమ్(హైదరాబాద్)లతో కలిసి చర్చించాడు. అందరూ 'సై' అంటే 'సై' అనుకున్నారు. ప్రాజెక్టు రిపోర్టు తయారైంది. అది చూసిన ఆ సంస్థ వెంటనే పదివేల డాలర్ల సాయం మంజూరు చేసింది.

## అందరిదీ ఒకేబాట

ఆర్థిక ఊతం లభించినా చేయాల్సింది ఎంతో ఉంది. అందరూ కలిసి 'పరివర్తన్' స్వచ్ఛంద సంస్థను మార్చి 2009లో ఏర్పాటు చేశారు. బాధ్యతలు పంచుకున్నారు. లక్ష్యసాధనకు కార్యరంగం సిద్ధం చేసుకున్నారు. గుంటూరు జిల్లాలోని ఆముదాలలంక, జువ్వలపాలెం, కిష్కింధపాలెం, పెసర్లంక, పోతార్లంక, పెదలంక, తడికలపూడి, తిప్పలకట్ట, చింతమోటు గ్రామాలను ఎంపిక చేసుకున్నారు. అందరూ కలిసి ఆయా గ్రామాల్లో తిరిగి సర్వే జరిపారు. మెరుగైన విద్య, వైద్య సదుపాయాలు, ఆధునిక పరిజ్ఞానం, సమాచార వ్యవస్థ, గిట్టుబాటు ధరలు, భూముల పరిరక్షణ లాంటి అంశాలను ఎంచుకున్నారు. ఆయా గ్రామాల్లో ఈ పనులను చేపట్టడానికి కొందరు ఔత్సాహికులను ఎంపిక చేశారు. ఆపై అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

–కె.అమర్‌కుమార్, షేక్ ముర్తుజా,
న్యూస్‌టుడే, విజయవాడ

### చేపట్టిన పనులివీ!

- గ్రామాల్లో భూసార పరీక్షలు చేయించి, ఏయే రకాల ఎరువులు వాడాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.
- జువ్వలపాలెం ప్రాథమికోన్నత పాఠశాలకు కంప్యూటర్లు సమకూర్చి, విద్యార్థులు, ఉపాధ్యాయులకు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తూ, రైతులకూ అవగాహన కల్పిస్తున్నారు.
- 250 టన్నుల నిల్వ సామర్థ్యంతో కోల్డ్ స్టోరేజ్ యార్డు నిర్మాణానికి సన్నాహాలు మొదలయ్యాయి. రూ.12 లక్షల వ్యయమయ్యే దీనికి కొందరు దాతలు ముందుకొచ్చారు.
- విద్యలో ప్రతిభ చూపే పేద విద్యార్థులకు సాయం అందిస్తున్నారు.
- వృద్ధులు, వితంతువులకు దాతల ద్వారా ఆర్థిక సాయం అందేలా ఏర్పాటు చేస్తున్నారు.
- గ్రామాల్లో హెల్త్‌కేర్ సెంటర్లు ఏర్పాటు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల సహకారంతో వైద్యసేవలందించాలని నిర్ణయించారు.
- కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా సూక్ష్మ రుణాల మంజూరుకు కృషి చేస్తున్నారు.

### సమస్యలు తెలిసాయి



నగరంలో పుట్టిపెరిగిన నాకు గ్రామీణుల సమస్యలు తెలిసాయి. వారు స్వయంసమృద్ధి సాధిస్తే దేశం అభివృద్ధి బాట పడుతుంది.

- సోనమ్

### ఏకమైతే విజయం



ప్రయత్నంలో లోపం లేకుంటే తప్పక విజయం సాధిస్తాం. యువత అంతా ఒక్కటైతే దేశాభివృద్ధి సాధ్యమే.

-తన్వి జైన్

### కలాం కల సాధ్యమే



యువత తలచుకుంటే సాధించలేనిదేమీ లేదని అబ్దుల్ కలాం చెప్పిన మాటలే మాకు స్ఫూర్తి. గ్రామాల్లో సమాచార వ్యవస్థను మెరుగుపరిచి, ఉపాధి కల్పిస్తే ఎంతో అభివృద్ధి చెందుతుంది.

- హర్షవర్ధన్

### పేదలు లేని భారతం రావాలి



గ్రామాల్లో ఒంటరైన వృద్ధులు, వితంతువులు ఎంతోమంది ఉన్నారు. వారికి ఆర్థిక సహాయం చేస్తాం. స్వయం ఉపాధితో ఊతమిస్తాం.

- దీపిక

### సమాచారం అందాలి



నేను రాజస్థాన్‌లోని గరిండాలో 21 మందితో సొసైటీ ఏర్పాటు చేసి పేపర్‌బ్యాగ్ తయారీలో శిక్షణ ఇచ్చాం. సమాచార వ్యవస్థను సుస్థిరం చేయడం ద్వారా ఇలాంటి కార్యక్రమాలను నెరవేరుస్తాం.

- సుమంత్

### అక్కడే నయం



ఇక్కడికన్నా మా రాష్ట్రమైన హిమాచల్‌ప్రదేశ్‌లోని గ్రామాల్లో మెరుగైన సమాచార వ్యవస్థ ఉంది. ఆ పరిస్థితులు రావాలి. మేం ఉద్యోగం చేస్తూనే, ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం.

- సౌరవ్